# గుర్రోక్లిన్

—క్రొవ్విడి హరగోపాలకృష్ణ

**సుబ్బిగాడు** నేను ఒక మంచంలో తిని, ఒక కంచంలో.... క్షమించాలి, ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకోక పోయినా, చిన్నప్పటినుంచి చాలా దగ్గర స్నేహితులం. ఒకటో తరగతిలో మమ్మల్నిద్దర్నీ జాయిన్ చెయ్యటానికి మా నాన్నలు స్కూలుకి తీసుకు వెళ్ళారు. అప్పటికి వాడు నాకు పరిచయం లేదులెండి. అప్పుడు స్కూల్లో ఒకటే సీటు ఖాళీ ఉందని చెప్పినప్పుడు వాణ్ణి చూస్తే నాకు అసహ్యం వేసింది, నా సీటు ఎక్కడ కొట్టేస్తాడో నని. అసలు సీటంటే అప్పట్లో నాకు తెలియక పోయినా, నాదేదో వాడు లాక్కుపోతున్నాడంటే కోపమేగా మరి.

ఎలాగయితేనేం, ఇద్దరికీ సీటు వచ్చింది. అప్పట్నుంచి మా ఇద్దరి స్నేహం మామాలాగే తాడిచెట్టులా ఎదిగిపోయింది. అలాగని అంతవరకూ మేం ఎప్పుడూ కొట్లాడుకోకుండా ఉండలేదు. దెబ్బలాట ఆడుకుని మేం ఇద్దరం మాట్లాడుకోవటం ఆగిపోయినతరువాత వాడే ముందర మాట్లాడే వాడు. వాడు మాట్లాడడానికి ముందు చాలా మొహమాట పడేవాడు. నెమ్మదిగా నా దగ్గరికొచ్చి—''ఒరేయ్! ఈ జీడి, ఈ జంతిక, ఈ కజ్జికాయ తీసుకుని నాతో మాట్లాడరా'' అనేవాడు. నేను దర్జాగా వాటిని పుచ్చుకుని తింటుంటే వెధవ సోదంతా కల్పించుకుని చెప్పేవాడు. ఆ వాగుడికి నాకు చిరాకెత్తి పోయేది. కానీ, రాజీ తిండి తింటూనే మళ్ళీ దెబ్బలాడటం ఇష్టం లేక పోయేది. ఆ విధంగా మే మిద్దరం ఇంటర్ వరకూ వచ్చాం.

ఎలాగయితేనేం, ఇంటర్ పూర్తి చేశాం. మా ఊళ్ళోచదువు అంతటితో సమాప్తం. డిగ్రీ చదవాలంటే పక్క ఊరు వెళ్ళాల్సొచ్చింది. మేం ఇద్దరం రూము తీసుకొని చదవాలని అనుకున్నాం. కాలేజీ మర్నాడు ప్రారంభిస్తారనగా వెళ్ళి రూమ్‌లో జాయినయ్యాం.

రాత్రి ఫస్టు షో సినిమా చూసొచ్చి పడుకున్నాం. ఇంతలో ఏదోశబ్దం. రూముఅదిరిపోతూంది. పంది బురదలో దొర్లుతూ అరిచినట్టుగా ఉంది. ఓరి వీడి దుంపతెగ! వీడికి గురక అలవాటులేదుకదా? అదే నిజమయితే నేను చచ్చానన్నమాటే. నాకు గురకంటే పరమ చిరాకు. నెమ్మదిగా వెళ్ళి వాడు కప్పుకున్న దుప్పటి తీసి చూశాను. అమ్మో! సౌండ్ ప్రూఫ్ రూమ్ తలుపు తీసినట్టుగా ఒక్కసారి శబ్దం బయటి కొచ్చింది. సైలెన్సర్ లేని మోటార్ సైకిల్‌లా బర్‌బర్ మంటూ ముక్కుతో మిమిక్రీ చేసేస్తున్నాడు. వీడి మొహం తగలెయ్య; ఈ రాత్రి వీడితో ఎలాగరా బాబూ చచ్చేది? చావేనా శరణ్యం.

''ఒరేయ్, సుబ్బిగా! ఒరేయ్, పందీ... వెధవపిడత మొహం నువ్వూను! నీ బ్రతుక్కి గురకొకటి.''

నా అరుపులు, కోపం తారస్థాయిని చేరాయి.

ఉలిక్కిపడి లేచాడు వాడు.

''ఏమిట్రా, అర్ధరాత్రివేళ అంకమ్మ శివాలన్నట్టు ఆ పిచ్చి కేక లేమిటి? బంగారంలాంటి నిద్ర పాడు చేశావ్'' అన్నాడు.

''ఏడిశావ్‌లే, నీ నిద్ర బంగారమూను, నానిద్ర ఇత్తడీనా? నీ వెధవ గుర్రుతో నా నిద్ర పాడుచేసి, నీ నిద్ర పాడుచేశానని ఇంకా వాగుతున్నావా?''

''నేనా? గురకా? నీ నిద్ర పాడైందా? ఎవడైనా నవ్వుతాడు—ఊరుకోరా'' అంటూ మళ్ళీ ముసుగు తన్నేశాడు.

ఓరి, వీడి శ్రాద్ధం చెట్టుకిందెట్టా! ఎంత ఖచ్చితంగా మాట్లాడేవురా? గుర్రెట్టలేదంటే అప్పీల్ ఏముంది? ఇప్పు డీ వెధవకోసం సాక్ష్యాలు ఎక్కడి నుంచి తేను? టేప్ రికార్డ్ చేసి వినిపించినా నా గురక రికార్డు చేశావని నమ్మక పేమిటి అనే రకం వీడు.

నేను ఇలా ఆలోచించే లోపలే మళ్ళీ గురక మొదలెట్టాడు. ఇంక ఈ రాత్రికి జాగారమే అని నిశ్చయించుకుని కిటికీలోంచి కనిపించే చుక్కల్ని లెక్క పెడుతూ కూర్చున్నాను.

పధ్నాలుగు వేల ఏభై—పధ్నాలుగువేల ఏభై ఒకటి...

• • •

''సుబ్బుడూ!''

''ఏం చిట్టీ?''

''ఇవ్వాళ డాక్టర్ దగ్గరకు వెళ్దాంరా!''

''ఎందుకు, పండూ?''

''ఇలాంటి వెధవప్రశ్న లెయ్యక చెప్పింది చెయ్యి.''

''ఏమిట్రా, గోపీ, నీకేమయింది? నిన్నరాత్రి నుంచి చూస్తున్నాను. నేను గురక పెట్టాననంటావ్. ఇవ్వాళ అర్థం లేకుండా డాక్టర్ దగ్గరకు వెళ్దాం పదమంటావ్. ఇంతకీ పిచ్చెక్కలేదు కదా నీకు!''

''ఇంకా ఎక్కలేదు. ఎక్కుతుంది. అప్పుడు బాగా సంతోషిద్దువుగాని, అప్రాచ్యపు వెధవా! అడ్డ గాడిదలా రాత్రంతా గుర్రెట్టి నా నిద్ర పాడుచేసిందే కాకుండా, ఇంకా పిచ్చెక్కిందా? వెర్రెక్కిందా? అని అడుగుతున్నావా? నీ తోలు ఒలిచేస్తాను. నీడొక్క చీరేస్తాను. రాస్కెల్! బ్రూట్! స్కౌండ్రల్, ఢాం.... ఢాం.... ఢిష్!''

ఒళ్ళు మండి నాలుగూ దులిపేశాను. దీన్నిబట్టే నాకు గుర్రంటే ఎంత అసహ్యమో తెలుసుకోవచ్చు.

నేను అలా మాట్లాడేసరికి సుబ్బిగాడు డంగ్ అయిపోయాడు.

''సర్లేరా. పద, నీ ఇష్టం వచ్చినట్టే చెయ్యి'' అంటూ కసాయివాడి వెంట గొర్రె వస్తున్నట్టు ఫీలయి ననుసరించాడు.

• • • •

డాక్టర్‌తో అన్ని సంగతులూ చెప్పాను. ఆయన తల నాలుగు సార్లు గాలిలో తిప్పి, పెన్నుని కాసేపు నోట్లో పెట్టుకొని, బుర్ర గోక్కుంటూ పచార్లు చెయ్యటం ప్రారంభించాడు. పాపం, ప్రాక్టీసు లేనట్టుంది—తీరిగ్గా ఆలోచిస్తున్నాడు. లేకపోతే ఈ పాటికి ఏ విక్సో, కాల్షియం శాండజో వ్రాసి పంపించేవాడు.

ఆయన అలా ఒక పావుగంట పచార్లు చేసి, కాళ్ళు లాగినట్లయి, వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

''అబ్బాయిలూ, వైద్య శాస్త్ర ప్రకారం గుర్రు అనేది ముక్కులోంచి వస్తుంది.''

నా బొందలా ఉంది. ఈయన అరగంట ఆలోచించిన తరవాత కనిపెట్టిన విషయం ఇదన్న మాట!

''దీనికి మందు అనేది లేదు. అందుచేత, అబ్బాయిలూ, ఒక పని చెయ్యండి. ఇదిగో— ఈ ప్లాస్టర్ ఉంది చూశారూ— చూశారా? సరే, ఈ ప్లాస్టర్ని పడుకోబోయే ముందు ముక్కు రంధ్రాల్ని మూసేటట్టుగా అతికించండి. గుర్రు ఫినిష్.''

''మనిషి కూడా ఫినిషైపోతాడు. ఏమంటారు, డాక్టర్?''

''కావచ్చు.''

''నువ్వేం డాక్టరువయ్యా? నీకు పట్టా ఇచ్చిన యూనివర్సిటీ ఏదో చెప్పు. టైమ్ బాంబు ఒకటి పెట్టొస్తాం. పదరా పదు. ఇంకా సిగ్గులేదూ? కూర్చున్నావు'' అంటూ సుబ్బారావుని లేపి బయటి కొచ్చాం.

''ఇదిగో, అబ్బాయీ, ఫీజేదోయ్'' అనే కేక వినపడింది. గబగబా మళ్ళీ లోపలి కొచ్చి— ''ఫీజు కావాలీ? నువ్వు సలహా ఇచ్చినందుకేగా ఫీజు! సరే, నీ సలహాకి నా సలహా ఫీజుగా తీసుకో. ఏమిటంటావా? ఈ ప్లాస్టరుంది చూశావ్రూ, చూశావా? సరే, ఈ ప్లాస్టర్ని కళ్ళమీద అతికించుకుని వీధిలో చెయ్యి చాపుకొని నిలబడు. నీకు కావలసినంత ఫీజు వస్తుంది. ఎలా ఉంది సలహా? వస్తా మరి'' అంటూ



బయట పడ్డాను.

సుబ్బారావు మటుకు ప్రేక్షకుడులా చూస్తూ ఉండి పోయాడు. రూమ్‌కి వచ్చిన తరవాత ''ఒరేయ్, ఆ డాక్టర్ పిచ్చివాడురా'' అన్నాడు.

''నిజంగానా?''

''నిజమే.''

''నీకెలా తెలుసు?''

''ఆయన మాకు దూరపు చుట్టం కూడాను.''

''ఈమాట ముందరే ఎందుకు ఏడవకూడదు?''

''నువ్వు నన్ను చెప్పనిస్తేగా?''

''అఘోరించావ్‌లే.''

తరవాత వాణ్ణి చాలామంది డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్ళాను. ఏవేవో మందులు వ్రాసిచ్చారు. కాని, వాడి గుర్రులో మార్పు లేదు. నాకు నిద్ర లేదు. ఈ విషయంలో రోజూ సుబ్బారావుని తెగతిడుతుండేవాడిని.

ఒకనాడు నేను కాలేజీ నుంచి వచ్చేసరికి సుబ్బడు చాలా సంతోషంతో కనిపించాడు. ఏమిటో అడిగాను.

''ఇవ్వాళతో నీకు నా గుర్రు ప్రాబ్లం తీరి పోతుందిరా.''

''అబ్బ! ఎంత సంతోషకరమైన వార్త చెప్పావురా! అదెలా సాధ్యం?''

''ఇదిగో ఈ పెట్టెలో ఏమున్నాయో చూడు.''

తెరిచి చూశాను. అందులో వింత ఆకారాల్లో రెండు రబ్బరు ముక్కల్లాంటివి ఉన్నాయి. ''ఏమిట్రా ఇవి? ఇంతంత పెద్ద మాత్ర లెప్పుడూ చూడలేదు. ఎలా వేసుకోగలవురా?''

''నోర్మూస్తావా నువ్వు? ఇవి మాత్రలు కావు. ఇయర్ ప్లగ్స్. అంటే,చెవిలోకి ఏ శబ్దం వెళ్ళకుండా చేసేవి. పడుకోబోయే ముందు చెవుల్లో పెట్టుకో. నా గుర్రు నీకు వినిపించదు...''

ఇంకా ఏదో చెపుతున్నాడు. కానీ, అవేవీ నాకు వినిపించటం లేదు. అప్పటికే ఇయర్ ప్లగ్స్ నా చెవుల్లో దూర్చేశాను.

ఇవ్వాళ నాకు పండగలా ఉంది. ★